క్లుప్తంగా

వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మోడల్ మండల సమాఖ్యలో భాగంగా మహిళ సంఘాలకు వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం గంగారాం మహిళలకు సంస్థల బలోపేతం, ఆర్థిక సుస్థిరత సాధించడం, సామాజిక అభివృద్ధి, సంపూర్ణ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, విద్య, నైపుణ్యాల పెంపుదల వంటి పలు అంశాల కార్యాచరణ ప్రణాళికపై శిక్షణనిచ్చారు. గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, వీవోఏ, సీసీలు, సీబీవోలు పాల్గొన్నారు.

17 నుంచి జన చైతన్య యాత్ర



ఆర్మూర్‌టౌన్: దేశవ్యాప్తంగా బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జన చైతన్య యాత్రను ప్రారంభిస్తున్నట్లు జిల్లా సీపీఎం పార్టీ కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశంలో మతోన్మాదం నింపుతుందని, ప్రజా సమస్యలు గాలికి వదిలేసిందన్నారు. మొదటి యాత్ర వరంగల్‌లో 17న, రెండవ యాత్ర 23న ఆదిలాబాద్, మూడో యాత్ర 24న నిజామాబాదులో ప్రారంభమవుతుందన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, పల్లపు వెంకటేష్, సాయిలు, భూమన్న, సుజాత, భామండ్ల రవి, అశోక్, సిద్దాల నాగరాజు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



రుద్రూర్: మోస్రా మండలం ఘన్‌పూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను సర్పంచ్ దాసరి గంగారాం అందజేశారు. నాయకులు కృష్ణగౌడ్, సంజీవ్, సమద్‌ఖాన్, సాయిలు, బాల్‌రాజ్ గౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ



వర్ని: మండల కేంద్రంలోని మాదాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు బుధవారం స్కాలర్‌షిప్‌లను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 20మంది విద్యార్థులకు రూ.10 లక్షల చెక్కులను అందజేశారు. అలాగే 300 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ట్రస్టు మేనేజర్ ఠాగూర్, స్థానిక నాయకులు సాయిబాబా, గోపాల్, పిట్ల శ్రీరాములు, హనుమంత్ రెడ్డి ఉన్నారు.

వేంపల్లిలో పశువైద్య శిబిరం



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో బుధవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది ఆవులకు, గేదెలకు వైద్య చికిత్స అందించారు. ఉప సర్పంచ్ జక్క గంగాధర్, వైద్యులు సంతోష్, గౌతం, రాజాశేఖర్ రావు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



మోర్తాడ్: మండలంలోని పాలెంలో బుధవారం దళిత శక్తి ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల అధ్యక్షుడు ఉమేష్ మహారాజ్, నాయకులు రాజు, రాములు, సందీప్, శివ, శంకర్, శశికాంత్, కూన నర్సయ్య ఉన్నారు.

బోధన తీరు పరిశీలన

మోర్తాడ్: మండలంలోని పాలెంలో పాఠశాల బోధనను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. టీఎల్‌ఎం, చార్ట్స్, బ్లాక్ బోర్డ్ నిర్వహణను పరిశీలించారు. హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు సాగరిక, విశాల్ పాల్గొన్నారు.

గుంతల చింత తీరేదెన్నడు?

- అధ్వానంగా మారిన బోధన్–పెగడపల్లి రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అచన్‌పల్లి వద్ద కంకర తేలిన రోడ్డు



గుంతల రహదారిపై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

బోధన్‌రూరల్(బోధన్): బోధన్–పెగడపల్లి రహదారి (రోడ్డు) అధ్వానంగా తయారైంది. రహదారిపై అనేక చోట్ల కంకర తేలి, భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై నెలలు గడుస్తున్న అధికారులు కనీసం మరమ్మతులు కూడ చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మూడు మండలాలకు ప్రధాన రోడ్డు..

బోధన్ నుంచి బోధన్–నిజామాబాద్ రోడ్డు తర్వాత బోధన్–పెగడపల్లి రోడ్డు మార్గంలో అధికసంఖ్యలో వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా బోధన్ నుంచి మండలంలోని లంగ్డాపూర్, బర్దీపూర్, పెంటాకాలన్, భూలక్ష్మీ క్యాంపు, పెగడపల్లి, చిన్న మావంది గ్రామాలకు, రెంజల్, నవీపేట మండలాల్లోని పలు గ్రామాలకు ఈ మార్గమే ప్రధాన రహదారిగా ఉంది. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం వ్యాపార, నిత్యవసర పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నమని వాపోతున్నారు. ఇక రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణించాల్సి వస్తే గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో నేషనల్ హైవే పనులు..

బోధన్–పెగడపల్లి రహదారి మార్గంలో అతి త్వరలో నేషనల్ హైవే పనులు మొదలవ్వనున్నాయి. ఈ రహదారిని బోధన్ నుంచి బైంసా వరకు టూ లైన్స్ నేషనల్ హైవే 161బీబీకు అనుసంధానం చేస్తూ పనులు చేపట్టనున్నట్లు నేషనల్ హైవే అధికారులు చెబుతున్నారు. నేషనల్ హైవే పనులు చేపట్టేవరకు బోధన్ – పెగడపల్లి రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు పూడ్చాలని, కంకర తేలిన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో రోడ్డు సమస్యపై దృష్టిసారించి వాహనదారులు, ప్రమాణికులు కోరుతున్నారు.

"రోడ్డు ప్రమాదకరంగా ఉంది..



బోధన్ – పెగడపల్లి రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో అనేక చోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పలు చోట్ల కంకర తేలి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో రోజు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– మంద నాగరాజు, పెగడపల్లి గ్రామం, బోధన్ మండలం

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే జోడో యాత్ర



సాటాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, కర్షకులు, మహిళలు, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్‌సే హాత్ జోడో యాత్ర నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో బుధవారం ఆయన స్థానిక రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాత్ర గురువారం సాయంత్రం బోధన్‌కు చేరుకుంటుందని కార్నర్ మీటింగ్‌కు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. నాయకులు మొబిన్‌ఖాన్, శంకర్‌గౌడ్, జావీదోద్దిన్, ఎంఎల్ రాజు, అంతరెడ్డి రాజరెడ్డి, క్రిష్ణ, రాములు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి యాత్రను విజయవంతం చేయండి

ఎడపల్లి(బోధన్) : మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల సాధకబాధకాలు తెలుసుకునేందుకు రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బోధన్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. నాయకులు శ్రీనివాసరావు, నాయకులు గైని పోచయ్య, లింగం, పరాన్, మచ్చూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ నియోజకవర్గంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షుడు పాషామోయినొద్దిన్, మండల అధ్యక్షులు గంగాశంకర్ కోరారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు నవీన్‌కుమార్, ఖలీం, ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షులు సాయికృష్ణలు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



బాల్కొండ: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టి, ఎస్సీలలో అన్ని కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ సంగ్రామ యాత్ర బుధవారం బాల్కొండకు చేరుకుంది. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగలకు తీరని ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని బొందపెడుతామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయడం ద్వారా ప్రభుత్వానికి ఒక్క రూపాయి ఖర్చు కాదన్నారు. బీజేపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్, రాష్ట్ర కార్యదర్శి ప్రణీత్, కవ్వ రమేశ్, నల్ల గణేష్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధం



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గం అభివృద్ధి పనులపై చర్చకు తాము సిద్ధమని, కాంగ్రెస్ నాయకులు సిద్ధమేనా అని బీఆర్ఎస్ నాయకులు మిట్టపల్లి మహిపాల్, సామ మహిపాల్, రేగుల్లరాములు, జైడి నాగధర్ సవాలు విసిరారు. వేల్పూర్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 'జోడో యాత్ర'లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బాల్కొండ అభివృద్ధిపై చేసిన ఆరోపణలపై కళ్లు తెరచి ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సవాలు విసిరిన దానికి తాము కచ్చితంగా కట్టుబడి ఉంటామని, కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉండాలని సమయం ఎప్పుడో, ఎక్కడో చెప్పాలన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి



బాల్కొండ: బాల్య వివాహాలను నివారించాలని సీడీపీవో భార్గవి అన్నారు. ముప్కాల్ మండల పరిషత్‌లో బుధవారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులను కాపాడాలన్నారు. బాలికలను వేధింపులకు గురిచేస్తే కఠినమైన చర్యలు తప్పవన్నారు. ఎంపీడీవో దామోదర్, ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ మాదవి ఉన్నారు.



నెహ్రూనగర్‌లో శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్..



నాగేంద్రనగర్‌లో సిబ్బందిని సన్మానిస్తున్న నేతలు

కంటివెలుగు శిబిరం ప్రారంభం

వర్ని: మండలంలోని నెహ్రూ నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ నాని బాబు ప్రారంభించారు. శిబిరంలో వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు, కంటి అద్దాలు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వేల్పూర్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శిబిరాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, సర్పంచ్ రిక్క మహేశ్ ప్రారంభించారు. వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోర్తాడ్: కంటి వెలుగు వైద్య సిబ్బంది సేవలు మరువలేనివని ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్ సర్పంచ్ మోత్కూరి మంజుల అన్నారు. బుధవారం కంటివెలుగు శిబిరం ముంగింపు సందర్భంగా సిబ్బందిని ఆమె సత్కరించారు. వైద్యులు, సిబ్బందితో పాటు నాయకులు బాలాజీ గౌడ్, కారోబార్ జనార్ధన్ పాల్గొన్నారు.

ఎన్‌డీఎస్‌ఎల్ కార్మికుల ఉద్యోగ విరమణ



రిటైర్డు కార్మికులకు సన్మానిస్తున్న కార్మిక నేతలు

బోధన్: బోధన్ ఎన్‌డీఎస్ఎల్ (నిజాందక్కన్ షుగర్స్ లిమిటెడ్)లో పని చేసిన కార్మికులు నాగేశ్వర్‌రావు, అన్వర్ మియాలు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన గేట్‌కు ఎదురుగా ఓ చెట్టుకింద సదరు రిటైర్డు కార్మికులను తోటి కార్మికులు సన్మానించారు. గతంలో తోటి కార్మిక కుటుంబాలు, ఫ్యాక్టరీ అధికారులు, స్నేహితులు, బంధువుల మధ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం కొనసాగేది. విందులు సైతం ఇచ్చేవారు. ప్రస్తుతం ఆనాటి కార్మికుల వైభవం కనుమరుగైంది. ఇప్పుడు ఉద్యోగ విరమణ సందర్భంలో కార్మిక కుటుంబాల్లో నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. ఉద్యోగ విరమణ పొందుతున్న కార్మిక కుటుంబాలు కన్నీటి పర్యంతం అవుతున్నాయి. ఎన్‌డీఎస్ఎల్ ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు ఎనిమిదేళ్లు పూర్తి కావస్తున్న కార్మికుల నెలసరి వేతన బకాయిలు ఒక్క పైసా చెల్లించలేదు. ఎన్‌డీఎస్ఎల్‌లో ప్రైవేట్ సంస్థవాటా 51 శాతం, ప్రభుత్వం వాటా 49 శాతం ఉందని, అయినా అటు ప్రైవేట్‌యాజమాన్యం, ఇటు ప్రభుత్వం తమ కుటుంబాలను పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్తం

సామూహిక అన్నప్రాసన



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సరస్వతీ, వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యర్థ పదార్థాలను ఉపయోగించుకుని కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే, కార్యదర్శి దేవేందర్, వైస్ ప్రిన్సిపల్ నరేందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణ పనులను బుధవారం మండల బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఎంపీపీ బీమజమున, సర్పంచ్ ఎద్ల రాజేశ్వర్‌రెడ్డి, రైతు వేదిక కన్వీనర్ రాములు, ఉపసర్పంచ్ రిక్కమధు, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య జ్యోతికి సన్మానం'

బోధన్: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో సోమవారం రాత్రి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోధన్‌కు చెందిన ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్యజ్యోతిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సుమారు 50 మంది మహిళలను ఎంపిక చేసి సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు..

వివాహ వేడుకకు హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో బుధవారం జరిగిన సాలూర సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి కూతురు వివాహ వేడుకకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

కల్వర్టు కట్టండి సారూ..



పట్టణంలోని శక్కర్ నగర్ చౌరస్తా నుంచి శివాలయం వెళ్లే దారిలో కల్వర్టు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలలో కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. – బోధన్‌టౌన్(బోధన్)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ఫోన్ నంబర్ : 63052 49776

అభివృద్ధి, సంక్షేమంతో మూడోసారి గెలుస్తాం



వివిధ పార్టీల నేతలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్ : రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ముచ్చటగా మూడోసారి ఎన్నికల్లో విజయం సాధించి తీరుతామని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. హైదరబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లోగల ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఆలూర్ మండల కేంద్రానికి చెందిన దేవాంగ సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారిని ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువాతో పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశాడన్నారు. అలాగే మాక్లూర్ మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నాయకులు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, దీమెర శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



ఆర్మూర్‌లోని పరీక్షకేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



నవీపేటలో పరీక్షను పరిశీలిస్తున్న అధికారులు



బోధన్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్/నవీపేట/బోధన్‌టౌన్/రుద్రూర్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బుధవారం ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే వచ్చి, హాల్‌టికెట్ నంబర్లు చూసుకొని, పరీక్ష గదుల్లోకి వెళ్లారు. పరీక్ష సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి లోనికి అనుమతి ఇచ్చారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 237 మందికి గాను 229 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని సిబ్బంది తెలిపారు. నవీపేటలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ వీర్‌సింగ్ తనిఖీ చేశారు. ఈ పరీక్ష కేంద్రంలో 165 మంది విద్యార్థులకు గాను 157 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు.

పనులను వేగవంతం చేయాలి



బాల్కొండ: మన ఊరు– మన బడి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మన ఊరు – మన బడి పనులపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో వసతులను మెరుగు పరచాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, సర్పంచ్ బూస సునీత, ఉప సర్పంచ్ వాహబ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..



మాక్లూర్: మండలంలోని బోర్గాం (కె) గ్రామానికి చెందిన దేశెట్టి రాధ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఈ నెల 13, 14 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగిన 9వ రాష్ట్ర మహాసభలో 30మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా తనను ఏ కాగ్రీవంగా ఎన్నుకున్నట్లు దేశెట్టి రాధ బుధవారం తెలిపారు. బీడీ కార్మికుల సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తానని ఆమె వెల్లడించారు.

సమాచారం..

■ నేడు వేల్పూర్ మండల సమావేశం

వేల్పూర్: మండలకేంద్రంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బీమజమున అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

■ నేడు ముగియనున్న దరఖాస్తుల గడువు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వచ్చే విద్య సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గురువారం చివరి రోజు అని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

■ నేడు రుద్రూర్, కోటగిరికి స్పీకర్ రాక

రుద్రూర్: కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాలకు గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి రానున్నట్టు స్థానిక ప్రజాప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు స్పీకర్ చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

■ వేలంపాట 17కు వాయిదా

నవీపేట: నవీపేట జీపీ ఆధ్వర్యంలో నిర్వహించే వాటర్‌ప్లాంట్, సులభ్ కాంప్లెక్స్‌లకు బుధవారం నిర్వహించిన వేలంపాటలు మళ్లీ వాయిదా పడ్డాయి. రెండు వేలంపాటలకు కనీస ధర రాకపోవడంతో ఈనెల 17కు వాయిదా వేస్తున్నట్లు కార్యదర్శి గంగాధర్ పేర్కొన్నారు.